సాక్షి అనకాపల్లి

సోమవారం । 13 । జనవరి । 2025



న్యాయం చేయాల్సిందే
తమకు పరిహారం చెల్లించిన తర్వాతే పనులు ప్రారంభించాలని 'బల్క్ డ్రగ్' నిర్వాసితులు ఆందోళన చేశారు. 10లో



నోరూరించే కుందెల బెల్లం 10లో
ఎ.కోడూరులో తయారయ్యే కుందెల బెల్లానికి ఉత్తరాంధ్రలో మంచి డిమాండ్ ఉంది. సంక్రాంతికి భారీ ఎత్తున ఎగుమతి అవుతుంది.



నృసింహ దీక్షల విరమణ
సింహగిరిపై మాలధారులు స్వామికి తిరుముడులు సమర్పించి శ్రీ నృసింహ దీక్షలు విరమించారు. 10లో

న్యూస్‌రీల్

నమూనా విద్యుత్ బిల్లు దహనం

• పెంచిన చార్జీలు తగ్గించాలని డిమాండ్



దేవరాపల్లిలో విద్యుత్ నమూనా బిల్లును దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

దేవరాపల్లి: పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించడంతో పాటు స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న, మండల కార్యదర్శి బి.టి.దొర డిమాండ్ చేశారు. విపరీతంగా పెరిగిన విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్ల బిగింపును నిరసిస్తూ ఆదివారం దేవరాపల్లి ప్రధాన రహదారుల్లో పార్టీ నాయకులు ర్యాలీ చేపట్టారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో 20 అడుగుల మేర పొడవున్న భారీ నమూనా విద్యుత్ బిల్లును దహనం చేశారు. వెంకన్న, బి.టి.దొర మాట్లాడుతూ నాడు ప్రతిపక్షంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలుకొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చిన టీడీపీ మంత్రి లోకేష్ ఇప్పుడు వాటిని బిగించాలని ఆదేశాలు ఇవ్వడం ముమ్మాటికీ మోసగించడమేనని ధ్వజమెత్తారు. సోమవారం భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి దహనం చేయాలని జిల్లా ప్రజలను కోరారు.

హోంమంత్రి పర్యటనలో అపశ్రుతి

• టపాసు పేలి బాలుడి చేతికి తీవ్రగాయాలు



సాత్విక్ చేతికి గాయం

నక్కపల్లి : హోంమంత్రి వంగలపూడి అనిత పర్యటనలో అపశ్రుతి చోటు చేసుకుంది. ఆదివారం ఆమె న్యాయంపూడిలో రూ.10 లక్షల తో నిర్మించిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ రోడ్ల ప్రారంభానికి వచ్చారు. ఈ సందర్భంగా ఓసీ కాలనీ సమీపంలో కార్యకర్తలు కాల్చిన టపాసులు పేలలేదు. కార్యకర్తలు దాన్ని పట్టించుకోకుండా వదిలేశారు. పక్కనే ఎస్సీ కాలనీకి చెందిన సాత్విక్ అనే పదేళ్ల బాలుడు ఆడుకునే క్రమంలో పేలని టపాసును పట్టుకున్నాడు. అది చేతిలో పేలడంతో తీవ్రగాయం తగిలింది. తీవ్ర రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు సాత్విక్‌ను వెంటనే నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బాలుడిని అనకాపల్లి తరలించాలని వైద్యులు సూచించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

కేజీబీవీ ప్రిన్సిపాల్ సస్పెన్షన్

నర్సీపట్నం: వేములపూడి కేజీబీవీ ప్రిన్సిపాల్ శాంతిని సస్పెండ్ చేస్తూ జిల్లా అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ జయప్రకాష్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ కేజీబీవీలో కలుషిత ఆహారం తిని 37 మంది విద్యార్థినులు అనారోగ్యం బారిన పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఏపీడీ తీవ్రంగా స్పందించారు. వసతి గృహంలో ఘటనను దాచి పెట్టినందున చర్యలు తీసుకున్నట్లు సస్పెండ్ ఆర్డర్‌లో పేర్కొనట్టు తెలిసింది. ఆదివారం మధ్యాహ్నం ఆర్డర్ కాపీని ఆయన వాట్సప్ ద్వారా ఫార్వర్డ్ చేశారు.



ప్రభుత్వ ప్రోత్సాహం లేకనే రైతు దిగాలు..
సంక్రాంతి వచ్చిందంటే చాలు.. తీర్థాలు, ఎడ్ల బళ్ల పోటీలతో కళకళలాడేది. బయట ఉద్యోగాలు చేసేవారు ఇళ్లకు చేరుకునేవారు. కొత్త అల్లుళ్ల సందడి చేసేవారు. ఈ ఏడాది ఆ కళ కనుమరుగయింది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మా గ్రామంలో ఎక్కువమంది వ్యవసాయం మీద ఆధారపడేవారే ఉన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో రైతులు దిగాలుగా ఉన్నారు. అన్ని రంగాల వారూ నిరాశా నిస్పృహల్లో ఉండడంతో ఈసారి పండగ సందడే కనిపించడం లేదు.
– యాదగిరి రామచంద్రరావు, తగరంపూడి



రైతు కంట కన్నీరు రాష్ట్రానికి మంచిది కాదు
మా గ్రామాన్ని దేశంలోనే నెం.1గా నిలిపాను. జాతీయ క్లీన్ అండ్ గ్రీన్ గ్రామ పంచాయతీగా తగరంపూడి గ్రామం అవార్డు పొందింది. నేరుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు తీసుకున్నాం. మా గ్రామంలో 90 శాతానికి పైగా వ్యవసాయం మీదే ఆధారపడి బతుకుతున్నారు. ఈ ఏడాది రెండు సార్లు పంట మునిగి.. ధాన్యం ముక్కిపోయి.. పంట నష్టం రాకుండా అనేక కష్టాలను చవిచూశారు. రైతును కూటమి ప్రభుత్వం ఆదుకోవడంలో విఫలమైంది. సంక్రాంతి పండుగ రోజున సంతోషంగా ఉండే రైతు కన్నీరు పెట్టడం ఈ రాష్ట్రానికి అంత మంచిది కాదు.
– యాదగిరి అప్పారావు, సర్పంచ్, తగరంపూడి

- పల్లెల్లో కానరాని పండగ సందడి
- ఫైనల్లేక చిన్నబోతున్న పెద్ద పండగ
- తగరంపూడిలో ఏ ఇంటి గడప తొక్కినా అసంతృప్తి
- వ్యవసాయానికి భరోసా లేదంటున్న అన్నదాతలు
- మండుతున్న ధరలతో కొనుగోలు చేసుకోలేని దుస్థితి
- 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్‌లో వెల్లడైన వాస్తవాలివీ..

సిరి లేని సంక్రాంతి?

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

తగరంపూడి పంచాయతీ..

జనాభా 2300	గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా లబ్ధిదారులు 940
గడపలు 1200	
రైతు కుటుంబాలు 950	వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులు 55
అమ్మ ఒడి అందుకున్నవారు	280





తగరంపూడి గ్రామం

సాక్షి, అనకాపల్లి: ప్రతి ఇంటికీ కాంతులు తీసుకొచ్చే సంక్రాంతి పండగలో క్రాంతి కనుమరుగైంది. నేడు గడిచి రేపు పొద్దు పొడిచినట్టు... ఆటపాటలతో, ఆప్యాయత మాటలతో అందరూ ఒకచోట చేరి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి కళ తప్పింది. పల్లె వాకిట ఆనందాన్ని నింపే పర్వదినాన్ని.. సంప్రదాయాన్ని విడిచిపెట్టలేక.. ఏదో కానిచ్చేద్దాం అనేటట్లుగా.. చేసుకునే కుటుంబాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అనకాపల్లి మండలం తగరంపూడి గ్రామాన్ని, భీమిలి నియోజకవర్గం టి.నగరపాలెం పంచాయతీని పరిశీలిస్తే.. సంక్రాంతి సంబరాలు అటుంచితే.. ఏ గడప తట్టినా.. మౌనమే పండగ చేసుకుంటోంది. ఏ వీధికి వెళ్లినా ఆవేదనే ఆశల పతంగులు ఎగరేసుకుంటోంది.

ఏముందని పండగ చేసుకోవాలి?

ఒకప్పుడు ఏ ఊరికి ఆ ఊరే స్వయంపోషకం. ఊరందరి అవసరాలను ఊరే తీర్చేది. రైతులు పంట చేతికొచ్చి.. దాని ద్వారా వచ్చిన ఆదాయంతో పండగ చేసుకునేవాళ్లు. కులవృత్తులు కూడు పెట్టేవి. పండక్కి ఊరి సాంస్కృతిక సందడిని ఊరే సమకూర్చుకునేది. కొనుగోళ్లు, అమ్మకాలతో.. ప్రతి ఇంట్లో పండగ జరిగేది. కానీ.. కాలం మారింది. క్రమంగా పంటల దిగుబడి తగ్గిపోయింది. పెట్టుబడి పెరిగిపోయింది. కులవృత్తులు కనుమరుగైపోయాయి. రెడీమేడ్ రాజ్యమేలుతుంటే నేతన్న నీరసించిపోయాడు. ఇలాంటి సమయంలోనే ప్రభుత్వాలు ఆదుకునేవి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతన్నకు 'భరోసా' కల్పించి.. పెట్టుబడి సాయమందించింది. కులవృత్తులకు 'ఆసరా' ఇచ్చింది. మహిళలకు ఆర్థిక 'చేయూత' నందించింది. అందుకే.. ఊరందరి అవసరాల్ని ఊరు తీర్చకపోయినా.. సర్కారు సాయంతో సరదాగా గడిపేవారు. పండగకూ ప్రతి ఇల్లూ కళకళలాడేది. ఇప్పుడు ఎవర్ని అడిగినా ఏముందని పండగ చేసుకోవాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందరికీ అన్నం పెట్టే రైతు సంతోషంగా లేడు. పనులు సరిగా జరగక చేతికి చిల్లి గవ్వ దొరక్క కూలీ కూడా కూలబడిపోయాడు. వ్యాపారాలు లేకపోవడంతో వ్యాపారులు కునారిల్లిపోయారు. మహిళల్లోనూ ఆనందం కనిపించడం లేదు. అన్ని రంగాల ప్రజలూ అస్తవ్యస్త జీవనంలోకి నెట్టేసినట్లుగా మారిపోయారు. ఫలితంగా అసలైన సంక్రాంతి పండగ తగరంపూడిలో ఎక్కడా కనిపించడం లేదు.

రైతన్నకు కష్టకాలం



తగరంపూడి గ్రామస్తులకు ఖరీఫ్‌లో వరి, చెరకు ప్రధాన ఆధారం. రబీ సీజన్‌లో అపరాలు, కూరగాయలు పండిస్తుంటారు. తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ మూసివేసిన తరువాత చెరకు పండించలేదు. ప్రస్తుతం వరి పంట మీదే ఆధారపడి జీవిస్తున్నారు. పంట చేతికొచ్చి ఆదాయం అందిందనే సంతోషం ఏ రైతు ముఖంలో కనపడలేదు. గతేడాది ఇదే సమయానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల డబ్బులు, రైతు పంట దిగుబడి ఆదాయం చేతికొచ్చింది. రైతు భరోసా కేంద్రం అండగా నిలిచింది. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు ప్రక్రియ 10 శాతం కూడా అవ్వకపోవడంతో దిగువ, మధ్యతరగతి ప్రజల చేతుల్లో డబ్బు ఆడడం లేదు. దీంతో భోగి చేరువైనా పండగ సందడి కనిపించలేదు.

జగనన్నే హయాంలో ప్రతి రోజూ పండగే..

గత ఐదేళ్లపాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. చేతిలో డబ్బులు ఆడేవి. పండగలను వేడుకగా చేసుకునేవారం. ఈ ఏడాది సంక్రాంతి పండుగ ఎలా చేసుకోవాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఆదాయం లేదు. ఖర్చు ఎక్కువైంది. అప్పులు చేసుకుంటున్నాం. వ్యవసాయం నష్టం కూడా వాటిల్లింది. ఇంటిలో మా పిల్లల నుంచి మా తల్లిదండ్రుల వరకూ అన్ని వర్గాల వారికీ సంక్షేమ పథకాలు జగనన్న ఇచ్చేవారు. ఇప్పుడు ఒక్క పథకం కూడా ఇవ్వడం లేదు. ఎలా పండుగ చేసుకోవాలి?
– బి.శ్రీను, తగరంపూడి

చేతిలో చిల్లి గవ్వ లేదు..



గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా వచ్చేది. పెట్టుబడి సాయం అందేది. ఆర్బీకేల్లో ఎరువులు, విత్తనాలు అన్నీ అందుబాటులో ఉండేవి. వ్యవసాయం అంటే పండగలా చేసుకునేవాళ్లం. ఈ ప్రభుత్వ హయాంలో ఒక్క రూపాయి సాయం అందలేదు. సొంత పెట్టుబడి పెట్టుకోవాల్సి వస్తోంది. రూ.3, రూ.5లకు వడ్డీకి డబ్బులు తీసుకొని పంటలేసుకుంటున్నాం. ఆ వడ్డీలు తీర్చడానికి కూలి పనులకు కూడా వెళ్లాల్సి వస్తోంది. చేతిలో చిల్లి గవ్వ లేదు. ఇంకేమి పెద్ద పండగ చేసుకుంటాం.
– మొల్లి పెంటయ్య, రైతు, టి.నగరపాలెం

80 ట్రావెల్ బస్సులపై కేసులు నమోదు



ట్రావెల్ బస్సులను తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు

• 3 రోజుల్లో రూ.14 లక్షల జరిమానా

తుమ్మపాల: సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై చర్యలు తీసుకుంటున్నామని జిల్లా రవాణా శాఖాధికారి జి.మనోహర్ తెలిపారు. నిబంధనలను అతిక్రమించి, దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల నుంచి అత్యధిక చార్జీలు వసూలు చేసి, ఇబ్బందులకు గురి చేస్తున్న బస్సులపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. జిల్లాలో ప్రత్యేకంగా ఆరు బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 10 నుంచి చేపడుతున్న తనిఖీల్లో 80కి పైగా బస్సులపై కేసులు నమోదు చేసి, రూ.14 లక్షల జరిమానా విధించినట్లు చెప్పారు. ట్యాక్స్ బకాయిలు చెల్లించకుండా పర్మిట్ నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 20వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందన్నారు.

ఎంత ఘోరం!

- నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడి
- పోర్న్ వీడియో చూసి 13 ఏళ్ల బాలుడి అఘాయిత్యం
- కుమారుడిని వెనకేసుకొచ్చిన తల్లి
- ఆమె టీడీపీకి చెందిన వార్డు సభ్యురాలు



సంఘటన వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ కేవీ సత్యనారాయణ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

యలమంచిలి రూరల్: సభ్య సమాజం తల దించుకునే ఘటన.. చెప్పుకోవడానికి కూడా నోరు రానంతటి ఘోర సంఘటన.. పోర్న్ వీడియో ప్రభావంతో ఓ టీనేజీ బాలుడు చేసిన అఘాయిత్యం.. వెనకేసుకొస్తున్న ఓ తల్లి ప్రేమ సమాజానికి చేటు చేస్తున్న వైనం.. యలమంచిలిలో చోటు చేసుకుంది. బాలుడి తల్లి తెలుగుదేశం పార్టీకి చెందిన పంచాయతీ వార్డు సభ్యురాలు కావడంతో.. శనివారం సాయంత్రమే బాధితులు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించినా ఆదివారం ఉదయం వరకు పోలీసులు ఈ విషయం బయటకు రానీయలేదు. టీడీపీ వార్డు సభ్యురాలి కుమారుడు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. తన ఇంటికి సమీపంలో ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలికను సమీపంలో ఉన్న ఇంటి డాబాపైకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలికకు రక్తస్రావం కావడంతో విషయం తెలుసుకున్న తాత, కుటుంబ సభ్యులు బాలుడి తల్లికి చెప్పగా ఆమె బాలిక కుటుంబీకులపైనే ఎదురుదాడికి దిగింది. వైఎస్సార్‌సీపీ నేతల జోక్యంతో పోలీసులు ఎట్టకేలకు ఆదివారం ఉదయం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బాధిత బాలికను తొలుత యలమంచిలి 30 పడకల సామాజిక ఆస్పత్రికి, తర్వాత విశాఖ కేజీహెచ్‌కు తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ ఆదివారం మధ్యాహ్నం ఏటికొప్పాక గ్రామానికి వెళ్లి నేర స్థలం పరిశీలించారు. కేసు నమోదు కావడంతో బాధ్యుడైన బాలుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తన తల్లి మొబైల్ ఫోన్‌లో చూసిన ఓ పోర్న్ వీడియో ప్రభావంతో ఈ ఘాతుకానికి పూనుకున్నట్టు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ అభిప్రాయపడ్డారు.

అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ

బాధిత కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నాయకులు అండగా నిలిచారు. చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, పట్టణ, రూరల్ అధ్యక్షులు బొద్దపు ఎర్రయ్యదొర, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉద్దండం త్రినాథరావు తదితర నాయకులు ఆదివారం మధ్యాహ్నం బాధిత బాలిక కుటుంబసభ్యుల్ని కలిసి ధైర్యం చెప్పారు. ఎలాంటి మద్దతు అవసరమైనా తామంతా అండగా ఉంటామని వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆడపిల్లలు, చిన్నారులపై లైంగిక దాడులు పెరిగిపోతున్నాయని, అధికార కూటమి ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ పరిపాలనా వైఫల్యాలతో రాష్ట్రంలో వరుసగా చిన్నారులు, మహిళలకు రక్షణ కరువవుతోందన్నారు. ఈ దుర్ఘటన గురించి తెలుసుకొని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలించిపోయారని, వారికి అండగా నిలవాలని ఆదేశించారన్నారు. అఘాయిత్యానికి పాల్పడిన 13 ఏళ్ల మైనర్ బాలుడు తల్లి టీడీపీకి చెందిన వార్డు సభ్యురాలని తెలుసుకున్న ధర్మశ్రీ మనో ధైర్యం కోల్పోవద్దని, తాము అండగా ఉంటామని వారికి భరోసానిచ్చారు.

మనసే కోవెలగా..



గ్రామాల్లో మేలుకొలుపులు



కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

- గ్రామగ్రామాన ఆధ్యాత్మిక సౌరభాలు
- మార్మోగుతున్న హరినామ సంకీర్తనలు
- మేలుకొలుపులతో మానసిక ప్రశాంతత



సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం: గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి వెల్లివిరుస్తోంది. భక్తి పారవశ్యం మానసిక ప్రశాంతత చేకూరుస్తోంది. సనాతన సంప్రదాయాలకు మళ్లీ పెద్దపీట వేస్తూ దేవుని పూజలతో తన్మయత్వం పొందుతున్నారు భక్తులు. చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ ధనుర్మాసం పూజల్లో నిమగ్నం అవుతున్నారు. పెద్ద పండుగ ముందు పల్లెలన్నీ హరినామ సంకీర్తనతో మార్మోగిపోతున్నాయి. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేలుకొలుపు కార్యక్రమాలు అన్ని గ్రామాలకు విస్తరిస్తున్నాయి. చలికాలం వచ్చిందంటే కాసింత వెచ్చని ఎండ వచ్చే వరకూ నిద్ర లేవని వారు సైతం హరినామ సంకీర్తనలో మమేకం అవుతున్నారు. అచ్యుతాపురం మండలంలోని జగ్గన్నపేటలో ఐదేళ్ల క్రిందట ప్రారంభమైన మేలుకొలుపులు ఇప్పుడు మండలంలోని 12 గ్రామాలకు పైగా విస్తరించింది. తిమ్మరాజుపేట, హరిపాలెం, జగన్నాథపురం, కొండకర్ల, ఎర్రవరం, ఉప్పవరం, చీమలాపల్లి, దుప్పుతూరు, దోసూరు, గండివానిపాలెం, నరేంద్రపురం గ్రామాల్లో మేలుకొలుపులు నెలగంట కొట్టిన రోజు నుంచి ప్రారంభమయ్యాయి. ఉత్తరాయనంలో 6 నెలల పాటు దేవతలు సంచరించే సమయంలో సూర్యుడు మకర రాశిలో ప్రవేశించినప్పుడు దేవుడిని ఆరాధిస్తే మంచి జరుగుతుందనేది భక్తుల నమ్మకం. మేలుకొలుపు కార్యక్రమం వల్ల తెల్లవారుజాము నుంచే భక్తులు లేచి పుణ్యస్నానాలు ఆచరించి హరినామ సంకీర్తన చేస్తున్నారు. అయ్యప్ప మాలధారులు స్వామి సన్నిధికి వెళ్లిన తర్వాత మళ్లీ భక్తితత్వంలో కొనసాగేందుకు మేలుకొలుపులు ఉపయోగపడుతున్నాయని సమరసత సేవా ఫౌండేషన్ యలమంచిలి డివిజన్ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు చెబుతున్నారు. అన్ని వర్గాల ప్రజలకు మానసిక ప్రశాంతత, ఉల్లాసం లభిస్తోందని భక్తులు పేర్కొనడం గమనార్హం.

హరిదాసుల సందడి



హరిదాసుల అక్షయ పాత్రలో బియ్యం వేస్తున్న మహిళ

నెలగంట పెట్టిన రోజు నుంచి గ్రామాల్లో హరిదాసుల సందడి మొదలయ్యింది. అక్షయ పాత్రను తలపై పెట్టుకొని హరినామస్మరణతో వీధుల్లో సంచరిస్తూ ఆధ్యాత్మిక సౌరభాలను వెదజల్లుతున్నారు. గంగిరెద్దుల సందడి, గాలిపటాలతో చిన్నారుల కోలాహలం, ముగ్గుల పోటీల్లో మహిళల కళా కౌశలం ఊరూరా ప్రతిఫలిస్తోంది. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏకాదశి రోజున నగర సంకీర్తన, వారం వారం భజనలు, పౌర్ణమి రోజున సామూహిక హారతి, సత్సంగం, కార్తీక పౌర్ణమి రోజున వెన్నెలలో పాలను మరిగించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలు గ్రామాల్లో మహిళలు కీర్తనలు, కోలాటాలు నేర్చుకొని దేవాలయాల్లో ప్రదర్శనలు ఇస్తున్నారు. ఇది కూడా వారిలో భక్తి భావం పెంపొందించడంతో పాటు, శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడుతోంది.

క్లుప్తంగా

తీరంలో బోటు బోల్తా

రూ.15 లక్షల ఆస్తి నష్టం



సముద్రంలో మునిగిన బోటు

కొమ్మాది : మంగమారిపేట బీచ్‌లో ఇంజిన్ బోటు బోల్తా పడింది. బోటు యజమాని సూరాడ హరిబాబు తెలిపిన వివరాలు ప్రకారం శనివారం తన ఇంజిన్ బోటులో 20 మందితో వేటకు వెళ్లి.. తిరిగొచ్చి తీరంలో లంగరు వేసి ఉంచామన్నారు. ఆదివారం తెల్లవారు జామున వేటకు వెళ్లేందుకు తీరప్రాంతానికి వచ్చేసరికి కిలోమీటరు దూరంలో బోటు బోల్తా పడి ఉందని, వెంటనే తనతో పాటు వచ్చినవారంతా కలిసి మూడు బోట్ల సాయంతో తాళ్లు కట్టి తీరానికి తీసుకొచ్చామన్నారు. తీరంలో బలమైన ఈదురు గాలులు ప్రభావంతోనే బోటు బోల్తా పడిందని, వీటి వలన వలలు, బోటు కొంత మేర దెబ్బతిన్నాయని, సుమారు రూ.15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని హరిబాబు తెలిపాడు.

బ్రాహ్మణులపై దాడి గర్హనీయం



మాజీ కన్వీనర్ కొమ్మనమంచి

చోడవరం రూరల్: బ్రాహ్మణులు, అర్చకులపై జరుగుతున్న హింసాత్మక దాడులు గర్హనీయమని, ఇలాంటి వాటిని తక్షణం అరికట్టాలని ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ కన్వీనర్, స్థానిక గణేష్, గాయత్రి బ్రాహ్మణ సేవా ట్రస్టు ఉపాధ్యక్షుడు కొమ్మనమంచి నరసింహమూర్తి డిమాండ్ చేశారు. బ్రాహ్మణులు, అర్చకులు, పురోహితులను గౌరవించడం సంప్రదాయంగా వస్తుందన్నారు. అలాంటిది సభ్య సమాజం తలదించుకునే రీతిలో వారిపై దాడులకు తెగనాడడం సిగ్గుచేటన్నారు. నాగరికత ఎంత పెరిగినా బ్రాహ్మణ వర్గాలను గౌరవిస్తేనే సమాజ మనుగడ ముందుకు సాగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. వారిపై దాడులకు దిగిన వారు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని ఆదివారం ఓ ప్రకటనలో కొమ్మనమంచి డిమాండ్ చేశారు.

నోరూరించే కుందెల బెల్లం

ప్రతి ఒక్కరూ బెల్లంతో కూడిన ఆహార పదార్థాల తయారీకి మొగ్గు చూపుతుంటారు. ఇది ఆరోగ్యానికి మంచిది కూడా. అదే సంక్రాంతి వంటి పర్వదినం సమయాల్లో బెల్లానికి మంచి గిరాకీ ఉంటుంది. సంప్రదాయకర వంటకాలను బెల్లంతో తయారీ చేస్తుంటారు. కె.కోటపాడు మండలం ఎ.కోడూరు గ్రామంలో కుందెల రూపంలో తయారు చేస్తున్న బెల్లం విశేష ఆదరణ పొందుతోంది.



కుందెల బెల్లం తయారీ



పెనంలో తయారీ జరిగిన బెల్లం

- సంక్రాంతికి మంచి డిమాండ్
- ఎ.కోడూరులో విస్తృతంగా తయారీ
- విశాఖపట్నం, విజయనగరం జిల్లాలకు ఎగుమతి

కె.కోటపాడు: బెల్లం తయారీ పలు రకాలుగా ఉంటుంది. అది వివిధ రూపాల్లోనూ ఉంటుంది. దిమ్మలు, కుండ, కుందెలు, తదితర ఆకారాల్లో తయారు చేస్తుంటారు. వీటిలో కుందెల రూపంలో తయారీ చేసే బెల్లానికి మంచి డిమాండ్ ఉంది. కేజీ బరువులో లభిస్తుండడంతో సంక్రాంతికి ఎక్కువగా విక్రయాలు జరుగుతున్నాయి. ఈ కుందెల బెల్లం తయారీకి ఎ.కోడూరు గ్రామం కేరాఫ్ అడ్రస్‌గా పేరొందింది. తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం ప్రాంతం నుంచి పలువురు తయారీదారులు ఎ.కోడూరు గ్రామానికి వచ్చి ఈ కుందెల బెల్లంను ప్రత్యేకంగా తయారీ చేస్తున్నారు. బంగారు వర్ణపు ఛాయలో కనిపించే ఈ బెల్లం కొనుగోలుదారులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ కుందెల బెల్లంను తయారీదారులు తక్కువ ధరకే కిలో రూ.42కే అమ్మకాలు చేస్తున్నారు. తయారీ కేంద్రం వద్దకే వచ్చి పలువురు కొనుగోలు చేస్తుంటారు. స్థానికంగా అమ్మకాలను చేయడంతో పాటు విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లోని పలు గ్రామాలకు ఇక్కడి కుందెల బెల్లంను తయారీదారులు అమ్మకాల కోసం తరలిస్తున్నారు. బెల్లం తయారీ కోసం నిర్వాహకులు గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి షేర్లు లేని రైతుల నుంచి టన్ను రూ.2800 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఈ బెల్లం తయారీలో తక్కువ మోతాదులో రసాయనాలు వినియోగిస్తున్నట్టు తయారీదారులు చెబుతున్నారు. ప్రతి ఏడాది డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకూ ఈ కుందెల బెల్లంను తయారు చేస్తుంటారు.

నాణ్యంగా బెల్లం తయారీ



బెల్లంను తయారీ పూర్తి నాణ్యతతో ఉంటుంది. మార్కెట్‌లో బంగారు వర్ణపు ఛాయలో ఉండే ఈ బెల్లంను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతారు. కుందెల రూపంలో బెల్లం తయారీ కొంచెం కష్టంతో కూడుకున్న పని. తక్కువ ధరకే అమ్మకాలు చేస్తున్నాం. విశాఖపట్నం, విజయనగరం ప్రాంతాలలో వ్యాపారులకు ఇక్కడి నుంచే కుందెల బెల్లంను పంపిస్తున్నాం. ఫ్యాక్టరీ షేర్లు లేని రైతుల వద్దనే చెరకును కొనుగోలు చేసి బెల్లంను తయారు చేస్తున్నాం. టన్ను చెరకు నుంచి 100 కిలోల బెల్లం కుందెలు వస్తాయి.

– గరగ వీరన్న, బెల్లం తయారీదారు

రెండు బైకులు ఢీకొని యువకుడి మృతి

మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



మృతుడు జగదీష్(ఫైల్)



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు జగదీష్

ఎస్.రాయవరం : గుర్రాజుపేట జంక్షన్ సమీపంలో రేవు పోలవరం ఆర్అండ్‌బీ రోడ్డుపై శనివారం అర్ధరాత్రి జరిగిన ఘటనలో యువకుడు మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ విభీషణరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. రేవు పోలవరం గ్రామానికి చెందిన యువకులు అడ్డురోడ్డు నుంచి రేవుపోలవరం బైకులపై వెళుతుండగా గుర్రాజపేట జంక్షన్ సమీపంలో కొబ్బరి పీచు ఫ్యాక్టరీ సమీపంలో ఒకదాని వెంట మరొకటి బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో బైకుతో మరో బైకును ఢీకొట్టిన పల్లేటి జగదీష్ (20) అక్కడికక్కడే మృతి చెందాడు. ఇరువురి బైకులపై ప్రయాణిస్తున్న హర్షిత్‌కుమార్, ఎరిపల్లి వాసులకు తీవ్ర గాయాలు కాగా, మరో యువకుడు ఇబ్రాయిల్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. వీరిని 108 వాహనంలో స్థానికులు నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, తీవ్రంగా గాయపడిన వారిని విశాఖపట్నం ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నట్టు చెప్పారు. జగదీష్ మృతదేహానికి పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

యువకుడి అనుమానాస్పద మృతి



అప్పన్న (ఫైల్)

నర్సీపట్నం: నర్సీపట్నం మండలం వేములపూడి గ్రామంలో ఓ యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. బంధువుల కథనం ప్రకారం.. బండారు అప్పన్న(30) పశువుల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం రోజూ మాదిరిగానే మృతుడు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి 10.40 గంటల సమయంలో తన ఇంటికి వంద మీటర్ల దూరంలో సీసీ రోడ్డుపై అప్పన్న రక్తపు మడుగులో పడి ఉన్నాడు. మేనమామ గోవింద, కుటుంబ సభ్యులు వెళ్లి చూసేసరికి కొన ఊపిరితో ఉన్నాడు. ఆస్పత్రికి తరలించేందుకు 108 వాహనానికి ఫోన్ చేశారు. నర్సీపట్నం అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో నాతవరం మండలం నుంచి అంబులెన్స్ రావడం ఆలస్యమైంది. తీరా ఘటనా స్థలానికి వచ్చిన అంబులెన్స్‌లో ఎక్కించేందుకు సిద్ధపడుతుండగా అప్పన్న ప్రాణాలు విడిచాడు. మృతుడు కుడి చేయి విరిగిపోవడంతో పాటు మొహం అంతా చితికిపోవటం, తల వెనుక పెద్ద గాటు ఉండడంపై కుటుంబ సభ్యులు ఎవరో కొట్టి పడేశారనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అలాగని ఊరులో ఎవరితోనూ మృతుడికి గొడవలు లేవని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అప్పన్నకు వివాహం కాలేదు. తల్లిదండ్రులు మహాలక్ష్మి, ఆదిలక్ష్మి, సోదరుడు రమణ, ముగ్గురు అక్కచెల్లెళ్లు ఉన్నారు. డీఎస్పీ మోహన్, సీఐ రేవతమ్మ, ఎస్ఐ రాజారావు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని సీఐ రేవతమ్మ తెలిపారు.

18న వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఉత్సవం



గౌరీపరమేశ్వరుల ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లి: స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల మహోత్సవం ఈ నెల 18న అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు వాకాడ బాబు తెలిపారు. స్థానిక వేల్పులవీధి సీతారామకల్యాణ మండలంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 171 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగి అమ్మవారి ఉత్సవాలను ఉమ్మడి విశాఖ జిల్లాలోనే అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకూ ఉత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో నివసించే భక్తుల ఉత్సవంలో పాల్గొంటారని చెప్పారు. వీరికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉత్సవం రోజున అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణ పురవీధుల్లో శనివారం ఉదయం 11 నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకూ రథంపై ఊరేగిస్తామన్నారు. వివిధ రకాల నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్టేజ్ ప్రోగ్రాంలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అమ్మవారి ఉత్సవ పోస్టర్‌ను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి మద్దాల నూకరాజు, కోశాధికారి వేల్పుల గణేష్, పెద్దలు మద్దాల కూర్మారావు, గరికి వెంకటరావు, జనపరెడ్డి శ్రీరాములు, ఉమా, గొర్లి శేఖర్, బొద్దపు ప్రసాద్, ముత్తా ఈశ్వరరావు, శ్రీను, గుమ్మాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కొణతాల

వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారిని ఆదివారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

‘బల్క్ డ్రగ్’ నిర్వాసితులకు న్యాయం చేయాల్సిందే

- ఆ తరువాతే పనులు ప్రారంభించాలి
- రాజయ్యపేటలో ప్లకార్డులతో నిరసన
- వందలాది మందితో ర్యాలీ, మానవహారం



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్ కోసం భూములిచ్చిన రైతులకు పూర్తి స్థాయిలో నష్ట పరిహారం చెల్లించిన తర్వాతే పనులు ప్రారంభించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఆదివారం రాజయ్యపేటలో వందలాది మంది మత్స్యకారులు, నిర్వాసితులతో కలసి ఆందోళన నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలియజేశారు. గ్రామంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం వందలాది మందితో మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం భూసేకరణ సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లిస్తామని హామీ ఇచ్చి కేవలం భూములకు నష్టపరిహారం మాత్రమే చెల్లించిందన్నారు. పదేళ్ల నుంచి భూములు జోలికి రాకుండా ఇప్పుడు ఆగమేఘాల మీద కార్పొరేట్ సంస్థలకు భూములు కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు. నిర్వాసితుల సమస్యలు పూర్తిగా పరిష్కరించలేదన్నారు. ప్రభుత్వ భూములు సాగుచేసుకుంటున్న వారికి నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం ఇళ్లు కోల్పోయిన వారికి ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.15లక్షలు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద నిర్వాసిత కుటుంబాల్లో మేజర్లకు రూ. 25 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. డీ ఫారం రైతులకు సైతం పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించలేదన్నారు. బాధిత రైతుల సమస్యలు పరిష్కరించకుండా బల్క్‌డ్రగ్ పార్క్‌కు శంకుస్థాపన చేయడం దారుణమన్నారు. మోదీ మెప్పు కోసం సీఎం చంద్రబాబు రైతులను మోసం చేస్తున్నారన్నారు. ప్రమాదకర పరిశ్రమలను ఇక్కడ ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. బల్క్ డ్రగ్ పార్క్ నిర్మాణం వల్ల ఉపాధి కోల్పోతున్న చేతివృత్తుల వారు, గీత కార్మికులు, వ్యవసాయ కూలీలకు ఎటువంటి భరోసా ఇస్తారో ఇంత వరకు ప్రకటించలేదన్నారు. రాజయ్యపేట, పాటిమీద, మూలపర, బోయపాడు తమ్మయ్యపేట గ్రామాల్లో కొంత భాగాన్ని ఖాళీ చేయించాల్సి వస్తోందని, వారికి ఎక్కడ పునరావాసం కల్పిస్తున్నారో స్పష్టత లేదన్నారు. పేదల నుంచి తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి కార్పొరేట్ వర్గాలకు అధిక ధరకు విక్రయిస్తూ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందన్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా పనులు కొనసాగిస్తే అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎరిపల్లి నాగేశు, పిక్కి నూకరాజు, గొర్లె బాబూరావు, మాజీ ఎంపీటీసీ పిక్కి సత్తియ్య, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, మండల కన్వీనర్ ఎం.రాజేష్, జనసేన నాయకులు పిక్కి స్వామి, సీఐటీయూ నాయకులు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నృసింహ దీక్షల విరమణ



కుంభప్రోక్షణ నిర్వహిస్తున్న అర్చకులు



సింహగిరిపై తిరుముడులతో వెళ్తున్న దీక్షధారులు

సింహాచలం : సింహగిరిపై మాలధారులు శ్రీ నృసింహ దీక్షలు విరమించారు. 41 రోజుల మండల దీక్ష, 32 రోజుల దీక్ష ధారులంతా శిరస్సుపై తిరుముడులను పెట్టుకొని సింహగిరికి తరలివచ్చారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి వాటిని సమర్పించి దీక్ష విరమించారు. వారికి ఉచితంగా అంతరాలయ దర్శనాన్ని దేవస్థానం కల్పించింది. అనంతరం శ్రీగోకులంకి సమీపంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద వైదికులు దీక్ష ధారులందరిచేత శాస్త్రోక్తంగా దీక్ష విరమింపజేశారు. ఉత్తరాంధ్ర జిల్లాలు, విశాఖ ఏజెన్సీ ప్రాంతాల గిరిజనులు, ఒడిశా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున దీక్షధారులు సింహగిరికి తరలివచ్చారు. సింహాచలానికి చెందిన చందన పెరుమాళ్ పీఠం గురుస్వామి సానబోయిన రాజు, సింహాద్రి మఠం గురుస్వామి కశిరెడ్డి సురేంద్ర, శ్రీనృసింహ పెరుమాళ్ పీఠం గురుస్వామి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున దీక్షధారులు హరినామస్మరణలు చేసుకుంటూ తిరుముడిలతో సింహగిరికి తరలివెళ్లారు.

శ్రీనృసింహ హోమం, శాంతి కల్యాణం

శ్రీనృసింహ దీక్షల విరమణను పురస్కరించుకుని ఆలయ కల్యాణ మండపంలో శ్రీనృసింహ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. మహా పూర్ణాహుతి, కుంభ ప్రోక్షణను నిర్వహించారు. అలాగే స్వామివారి శాంతి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. తిరుముడులతో సుభద్రా కాంప్లెక్స్‌లోనుంచి అంతరాలయంలోకి వెళ్లే దీక్షధారులందరినీ కల్యాణమండపంమీదుగా పంపించి శ్రీనృసింహ హోమం, శాంతి కల్యాణం తిలకించే విధంగా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ఏఈవో వి.త్రినాథరావు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తొక్కిసలాట మృతుడి భార్యకు చెక్కు అందజేత



మృతుడి భార్యకు చెక్కు అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, టీటీడీ పాలక మండలి సభ్యులు

నర్సీపట్నం: తిరుపతి తొక్కిసలాటలో మృతి చెందిన నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లికి చెందిన బొడ్డేటి నాయుడుబాబు కుటుంబానికి తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ ప్రభుత్వం ప్రకటించిన రూ.25 లక్షల చెక్కును అందజేశారు. స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు, మరికొందరు టీటీడీ పాలకవర్గ సభ్యులతో కలిసి ఆయన బాధితుడి భార్య మణికుమారిని పరామర్శించి చెక్కును అందజేసారు. జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన పరిహారంతో పాటు పాలకమండలి సభ్యుడు రాజు రూ.50 వేలు, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి రూ.2 లక్షల సాయాన్ని బాధిత కుటుంబాలందరికీ అందజేస్తున్నట్టు తెలిపారు. మాజీ కేంద్ర మంత్రి, పాలకమండలి సభ్యురాలు పనబాక లక్ష్మితో పాటు మరో ఐదుగురు పాలకమండలి సభ్యులు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు పాల్గొన్నారు.

నేడు ఉపమాకలో గోదా కల్యాణం



గోదాదేవి అమ్మవారు

నక్కపల్లి: భోగి పండుగను పురస్కరించుకుని గోదా రంగనాథుల కల్యాణం వేడుకకు ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయం సర్వం సిద్ధమైంది. వైష్ణవ సంప్రదాయం ప్రకారం ఈ గోదా కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు అన్ని ఏర్పాట్లు చేశారు. శ్రీవల్లిపుత్తూరుకు చెందిన విష్ణుచిత్తుని కుమార్తె గోదాదేవి శ్రీరంగనాథుడిని పరిణయమాడటం కోసం నెల రోజుల పాటు ధనుర్మాస వ్రతాన్ని ఆచరించింది. వ్రతదీక్షలో తను అనుభవాలను, అనుభూతులను పాశురం రూపంలో శ్రీరంగనాథుడికి విన్నపం చేసి అంకితమిచ్చింది. గోదాదేవి వ్రతదీక్షను మెచ్చి శ్రీరంగనాథుడి ఆమెను వివాహమాడేందుకు అంగీకరించాడు. భోగినాడు గోదా రంగనాథుల పరిణయం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఉపమాకలో ఈ ఘట్టాన్ని గోదాదేవి అమ్మవారి పుష్పతోటలో సోమవారం ఉదయం 11 గంటలకు నేత్రపర్వంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు తెలిపారు. ధనుర్మాస అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉపమాకలో గజవాహనంపై స్వామివారికి తిరువీధి సేవలు నిర్వహించారు. తిరుప్పావై పాశురాలను విన్నపం చేసిన తీర్థ గోష్టి, ప్రసాద వితరణ చేశారు.



గజవాహనంలో స్వామివారికి తిరువీధి సేవలు

ప్రతి పల్లెలోనూ పక్కా రోడ్లు : మంత్రి అనిత



శిలా ఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి అనిత

నక్కపల్లి : కూటమి ప్రభుత్వం హయాంలో ప్రతి పల్లెలోనూ పక్కాగా సీసీ రోడ్లు వేయడం జరుగుతోందని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. ఆదివారం న్యాయంపూడిలో రూ.10 లక్షలతో నిర్మించిన రోడ్డు ప్రారంభించారు. అనంతరం ఆమె ఉత్తమ పంచాయతీగా ఎంపికై కేంద్రం నుంచి విడుదల అయిన కోటి రూపాయలతో నిర్మించే పలు రోడ్లు, కాలువల వంటి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తమ హయాంలో అన్ని గ్రామాలకి పక్కా రహదారి సదుపాయాలు కల్పిస్తామన్నారు. మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. పల్లె పండగ పేరుతో నిధులు విడుదల చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, సర్పంచ్ రెడ్డి వరహాలు, ఎంపీటీసీ అకేటి గోవింద్ పాల్గొన్నారు.

400 ప్రత్యేక బస్సులు నడిపిన ఆర్టీసీ

డాబాగార్డెన్స్: సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఆర్‌టీసీ ద్వారకాబస్టేషన్ నుంచి 400 ప్రత్యేక సర్వీసులు నడిపినట్టు ప్రాంతీయ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. నాలుగు రోజులుగా హైదరాబాద్‌కు 25, విజయవాడకు 40 బస్సులు నడపగా, ఆదివారం శ్రీకాకుళం 100, రాజమండ్రికి 20, కాకినాడకు 20, పార్వతీపురానికి 40, పలాసకు 30, సాలూరుకు 30తో పాటు రద్దీ ఉన్న ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు నడిపినట్టు చెప్పారు. భోగి రోజు కూడా ప్రత్యేక సర్వీసులు రద్దీకి అనుగుణంగా నడపనున్నట్టు పేర్కొన్నారు.

ఉక్కు ఉద్యోగుల తొలగింపు తగదు

- సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్



జీవీఎంసీ గాంధీ పార్కులో వీఆర్ఎస్ జీవో కాపీలను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులను బలవంతంగా తొలగించేందుకు బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న వలంటరీ రిటైర్మెంట్ స్కీంను తక్షణమే నిలిపివేయాలని చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొనసాగుతున్న జేఏసీ దీక్షా శిబిరంలో ఆదివారం విశాఖ డెయిరీ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వీఆర్ఎస్ జీవో కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ విశాఖ పర్యటన అనంతరం ఉద్యోగులను తొలగించే ప్రక్రియకు రాత్రి రాత్రే జీవో జారీ చేయడం దారుణమన్నారు. ఏడు వేల మందిని చేర్చుకునే అవకాశం ఉన్నా..ఉద్యోగులను, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడానికి పూనుకోవడం తగదన్నారు. కేంద్రం కుట్రలకు పాల్పడుతున్న స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని చెబుతున్న కూటమి ప్రభుత్వం ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. తక్షణమే స్టీల్‌ప్లాంట్‌కు ఇచ్చిన వీఆర్ఎస్‌ను ఉపసంహరించుకునేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.రమణ, అధ్యక్షుడు కె.వరహామూర్తి, పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, విశాఖ డెయిరీ నాయకులు వి.నారాయణ, డి.నాగమణి బాబూ, జి.నాగేశ్వరరావు, యు.శ్రీనివాసరావు, బి.కోటేశ్వరరావు, డి.లక్ష్మి, ఎల్‌వీఎం నాయుడు, అనసూయ, ఇంద్ర, విజయ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కల్కి అవతారంలో ధ్యాన వేంకటేశ్వరస్వామి



ధ్యాన వేంకటేశ్వరస్వామికి అలంకరణ

కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు కల్కి అవతారంలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. ధనుర్మాసోత్సవాలలో భాగంగా విష్ణుమూర్తి దశావతారాల్లో చివరి అవతారంగా కల్కిగా అలంకరించి విష్ణు సహస్ర నామార్చన చేశారు. ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులు ఎక్కువగా దర్శించారు. సోమవారం ఉదయం 10 గంటలకు గోదాదేవి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు తెలిపారు.

రేపటి నుంచి ఫోర్ బౌండరీ క్రికెట్ మ్యాచ్



ఫోర్ బౌండరీ క్రికెట్ కప్‌తో ఆడారి సతీష్, కోరిబిల్లి హరి, కొణతాల శ్రీను

అనకాపల్లి: సంక్రాంతి సందర్భంగా ఈ నెల 14, 15 తేదీల్లో గవరపాలెం జీవీఎంసీ చిన్న హైస్కూల్‌లో ఫోర్ బౌండరీ కప్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫోర్ బౌండరీ క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్లు ఆడారి సతీష్, కొణతాల శ్రీను, కోరిబిల్లి హరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో 16 టీమ్‌లు పాల్గొంటాయన్నారు. క్రికెట్ ఆటగాళ్ల 20 సంవత్సరాలు దాటి ఉండాలన్నారు. ప్రతి మ్యాచ్‌కు బెస్ట్ బ్యాట్స్‌మన్, బౌలర్, ఫీల్డర్ అవార్డులు ఇస్తామన్నారు.

మన్యం వీరుడు అల్లూరి విగ్రహావిష్కరణ



తాళ్లపాలెంలో అల్లూరి విగ్రహావిష్కరణలో ఎంపీ, ఎమ్మెల్యే

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో ఏర్పాటు చేసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆదివారం రాత్రి పూలమాలలు వేసి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆవిష్కరించారు. బీజేపీ నాయకుడు గళ్లా రాజు, టీడీపీ మండలాధ్యక్షుడు కాయల మురళీధర్, జనసేన నాయకుడు బుదిరెడ్డి మోహన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

పెందుర్తి: మండలంలోని గుర్రంపాలెం, నరవ ప్రాంతాల్లో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పెందుర్తి పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు.. నరవలోని ఓ నిర్మానుష్య ప్రాంతంలో నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు వారిని పట్టుకుని వారి వద్ద ఉన్న రూ.3 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. గుర్రంపాలెంలో ఓ తోటలో పేకాడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.2,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఏపీ గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 78 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-28 యూనిట్లు, ఓ పాజిటివ్-40 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

పండగ పాట్లు

- అనకాపల్లి ఆర్టీసీ బస్సు స్టేషన్‌లో ప్రయాణికుల ఇక్కట్లు
- రైల్వే స్టేషన్‌లోనూ అదే పరిస్థితి



గవరపాలెంలో హరిదాసుకు బియ్యం పోస్తున్న చిన్నారి

అనకాపల్లి: పట్టణంతోపాటు గ్రామాల్లో సంక్రాంతి పండగ మొదలైంది. కుటుంబ సమేతంగా నిర్వహించుకునే ఈ పండగకు చెన్నై, హైదరాబాద్, బెంగళూరు వంటి దూర ప్రాంతాల్లో విద్య, వ్యాపార, ఉద్యోగ రంగాల్లో స్థిరపడిన వారంతా వారి స్వగ్రామాలకు చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న వారితో అనకాపల్లి బస్సు, రైల్వే స్టేషన్లలో రద్దీ నెలకొంది. కిక్కిరిసిన ప్రయాణికులతో బస్సులు, రైళ్లు నిండిపోయి కనిపిస్తున్నాయి. అడుగుతీస్తే అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది.

గ్రామాల్లో కానరాని సందడి..

ప్రధానంగా సంక్రాంతి పండగకు ప్రత్యేకత ఉంది. ఇది పూర్తిగా పల్లెటూరి సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తోంది. భోగి, కనుమ మధ్యలో వచ్చే సంక్రాంతి పెద్ద పండుగ మాత్రమే కాదు, పెద్దల పండుగ అని కూడా అంటారు. మొదటి రోజు అంటే సోమవారం వేకువజామున భోగి మంటలు వేసుకునేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇళ్ల ముందు కళ్లాపి చల్లి ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పెట్టడం, రెండో రోజు పెద్దల పండుగ రోజు పితృ దేవతలకు సమర్పణలు చేయడం, మూడో రోజు పాడి పంటలనిచ్చే పశువులకు పూజలు చేసి గ్రామ వాసుల జీవితంలో మమేకమైన పశుసంపదను గౌరవించి, ఆరాధించడం సంప్రదాయంగా వస్తోంది. జిల్లా కేంద్రమైన అనకాపల్లికి ప్రత్యేకత ఉంది. గ్రామాలతో కలగలిపి పట్టణం ఉండటం వల్ల ఇక్కడ పల్లె వాతావరణం కనిపిస్తోంది. అయితే ఎక్కడా సందడి కనిపించలేదు. నెల రోజులుగా హరిదాసుల హడావుడి మాత్రమే కనిపిస్తోంది. ఇతర వృత్తుదారుల జాడ కానరాలేదు. సంక్రాంతి సంబరాలు తర్వాత గ్రామ తీర్థాలు, అమ్మవార్ల పండగలు ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా వివిధ ఆటలు, వాలీబాల్, ఎడ్లబళ్ల పందాలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

హిందూ సంప్రదాయాన్ని కాపాడుకోవాలి

హిందూ సంప్రదాయాన్ని కాపాడుకోవలసిన బాధ్యత నేటి యువతపై ఉందని హిందూ సంప్రదాయాలు, పండుగలు, దేవాలయాల పరిరక్షణ సమితి పట్టణ సమన్వయకర్త ఆడారి కుమార్ స్వామి అన్నారు. స్థానిక విజయరామరాజుపేటలో వినాయక మందిరం వద్ద సమితి ఆధ్వర్యంలో హరిదాసును శాలువాతో ఆయన సత్కరించారు. తెలుగు ప్రజలు అత్యంత వైభవంగా నిర్వహించే సంక్రాంతికి ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని చెప్పారు. కార్యక్రమంలో విజయరామరాజుపేట పెద్దలు బొబ్బిలి అప్పారావు, పిట్ల బుడ్డీశ్వరరావు, ఉగ్గిన నర్సింగరావు, ఆడారి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



విజయరామరాజుపేటలో హరిదాసును శాలువాతో సత్కరిస్తున్న ఆడారి కుమార స్వామి

భోగికి ఏర్పాట్లు

కశింకోట: మండలంలో సంక్రాంతి ఉత్సవాల్లో మొదటిదైన భోగి మంటలు పెద్ద ఎత్తున వేయడానికి సన్నాహాలు చేశారు. కశింకోటలోని గవరపేట, కస్పావీధి, సంతబయల, గోవిందరావు కాలనీ, హౌసింగ్ కాలనీ, సత్తెమ్మ కాలనీ, ఉప్పునీటి దిబ్బ, అగ్రహారం తదితర ప్రాంతాల్లో పెద్ద కర్ర దుంగలు తెచ్చి పోగు పెట్టి మంట వేయడానికి సిద్ధం చేశారు. బయ్యవరం, తాళ్లపాలెం, కన్నూరుపాలెం, నరసింగబిల్లి, ఉగ్గినపాలెం, ఏఎస్ పేట, తేగాడ, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, వెదురుపర్తి, జమాదులపాలెం, విసన్నపేట తదితర గ్రామాల్లో మంటలు వేయడానికి ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా యువత మంటలు వేయడానికి ఉత్సాహంగా కర్రలు తెచ్చి సన్నద్ధం చేశారు. భోగి పురస్కరించుకొని కశింకోటలోని లక్ష్మీనృసింహస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించనున్నట్లు ఆలయ అర్చకుడు అత్తిలి కోదండపాణి తెలిపారు.



అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విజయనగరం బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

గోదాదేవి కల్యాణోత్సవానికి ఏర్పాట్లు

కశింకోట: స్థానిక దేవాదాయ శాఖకు చెందిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు గోదాదేవి కల్యాణోత్సవాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఏటా భోగి రోజు వేణు గోపాలస్వామి, గోదాదేవిల ఉత్సవ విగ్రహాలకు కల్యాణాన్ని వేద మంత్రాల నడుమ సంప్రదాయంగా నిర్వహిస్తారు. ఇందుకు సన్నాహాలు చేశామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు సీతారామాచార్యులు, మారుతి తెలిపారు. సంక్రాంతి రోజు ఆలయం వద్ద తీర్థ మహోత్సవం జరగనుందన్నారు. తోడపెద్దు సేవ, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. దీంతో నెల రోజులపాటు నిర్వహించిన ధనుర్మాసోత్సవాలు ఆలయంలో ముగుస్తాయన్నారు. ఇదిలా ఉండగా



కశింకోటలో వేణుగోపాలస్వామి ఆలయం

స్థానిక గవరపేటలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ ధనుర్మాసోత్సవాల ముగింపులో భాగంగా గోదాదేవి కల్యాణోత్సవాన్ని సాయంత్రం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గా నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామి, గోదాదేవిల ఉత్సవ విగ్రహాలకు వివాహం జరిపించనున్నట్లు చెప్పారు.

నేడు కొణతాల రామలింగస్వామి పురస్కారాలు ప్రదానం



ట్రస్టు వ్యవస్థాపకురాలు లక్ష్మీపార్వతి

అనకాపల్లి: స్థానిక పాత బస్‌స్టేషన్ రహదారి కన్యకాపరమేశ్వరి దేవస్థాన సంఘం, ఉప్పల చంద్రశేఖరరావు ఏసీ కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం కొణతాల రామలింగస్వామి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో కొణతాల రామలింగస్వామి పురస్కారం-2025 ప్రదానం చేయనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకురాలు కొణతాల లక్ష్మీపార్వతి తెలిపారు. మండలంలో తుమ్మపాల పంచాయతీ చిన్నబాబు కాలనీలో ఆదివారం ఆమె మాట్లాడారు. ఉపాధ్యాయ రంగంలో విజయనగరం జిల్లాకు చెందిన డాక్టర్ బొంతలకోటి శంకరరావు, సేవా రంగంలో హైదరాబాద్ సర్వ్ నీడ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ సి.గౌతమ్ కుమార్, విశాఖకు చెందిన మమతా చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు ఎల్లేటి మమతకు, ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లాకు చెందిన నాగులు ఆదేషాకు, తెలంగాణ రాష్ట్రం భద్రాది కొత్తగూడెంకు చెందిన గ్రీన్ మోటార్ వెహికల్ గార్డెన్ వ్యవస్థాపకుడు కొత్తూరు సుర్విరాజశేఖర్‌కు, ఉత్తమ విద్యార్థి రంగంలో శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలానికి చెందిన యూపీఎస్సీలో ఇంటర్వ్యూకు ఎంపికైన రావాడ సాయి మోహిని మానసకు పురస్కారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ హాజరవుతారన్నారు. నాలుగు సంవత్సరాలుగా రాష్ట్రంలో, దేశంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వ్యక్తులకు అవార్డులు ఏటా జనవరి 13న అందజేస్తున్నట్లు చెప్పారు.

కోడి పందెం, పేకాట శిబిరాలపై పోలీసుల దాడి

రాంబిల్లి(యలమంచిలి): కోడి పందెం, పేకాట శిబిరాలపై పోలీసులు దాడి చేశారు. రాంబిల్లి సీఐ సి.హెచ్ నర్సింగరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాంబిల్లి మండలం దిమిలి, గజరెడ్డిపాలెం గ్రామాల్లో ఆదివారం కోడి పందెం, పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులు, 2 పందెం కోళ్లు, రూ.2 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. పండగ సందర్భంగా గ్రామాల్లో కోడి పందేలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే తమకు సమాచారం తెలియజేయాలని కోరారు.

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీ పరిధి తెరువుపల్లిలో కోడిపందేల శిబిరంపై యలమంచిలి రూరల్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. తెరువుపల్లి గ్రామ శివార్లలో కోడి పందేలు నిర్వహిస్తున్న సమాచారంతో అక్కడకు వెళ్లిన పోలీసులు ఇద్దరు వ్యక్తుల్ని, మూడు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు యలమంచిలి రూరల్ ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

కశింకోట: స్థానిక ద్వారపురెడ్డి వీధిలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. దీనికి విశేష స్పందన లభించింది. సుమారు 50 మంది యువకులు ఉత్సాహంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జి.ఎస్. కొండబాబు మాస్టార్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు, పార్టీ మండలాధ్యక్షుడు అప్పికొండ అప్పారావు, ఎంపీటీసీ సభ్యురాలు నడిపల్లి గంగా భవానీ, మాజీ ఉప సర్పంచ్ నడిపల్లి సన్యాసిరావు, నాయకులు వైఏ రాజు, విశ్వ హిందూ పరిషత్ నాయకుడు శిష్టి అప్పారావు, వివేకానంద విజ్ఞాన పరిషత్ ప్రతినిధులు జనపరెడ్డి హరనాథ్, గుమ్మాల శ్రీనివాసబాబు, ద్వారపురెడ్డి రాంబాబు, డి. నూకేశ్వరరావు, గొంతిన రమణాజి, ప్రగడ నూకరాజు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు

రామాలంకరణలో సింహాద్రినాథుడు



రామాలంకరణలో అప్పన్న



తిరువీధిలో స్వామి ఉత్సవమూర్తులు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా మూడవరోజు ఆదివారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి రామాలంకారుడిగా దర్శనమిచ్చాడు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శ్రీరాముడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకిలో అధిష్ఠింపజేశారు. ఆళ్వారులను మరొక పల్లకిలో చేర్చి, సింహగిరి మాడ వీధుల్లో ఘనంగా తిరువీధి నిర్వహించారు. విశేష హారతి అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మహిళల ముగ్గుల పోటీలు నేడు

కశింకోట: స్థానిక పందిరి వీధి అంగన్‌వాడీ కేంద్ర భవనం వద్ద మహిళలకు భోగి సందర్భంగా సోమవారం ఉదయం 10 గంటలకు గ్రామ స్థాయి మహిళల ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఆదరణ సేవా స్ఫూర్తి ఫౌండేషన్ తెలిపింది. విజేతలకు ప్రథమ బహుమతిగా ఎల్ఈడీ టీవీ, ద్వితీయ బహుమతిగా లేడీస్ సైకిల్, తృతీయ బహుమతిగా గ్రైండర్, 4వ బహుమతిగా మిక్సీ, ప్రత్యేక బహుమతులుగా కూలర్ ఫ్యాన్, పట్టు చీర అందజేయనున్నట్లు పేర్కొంది.

15న జిల్లా స్థాయి గుర్రపు పోటీలు

మునగపాక: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మునగపాకలో ఈ నెల 15న జిల్లా స్థాయి గుర్రపు పందేలు నిర్వహించనున్నట్లు డాన్‌జిమ్ అధినేత పెంటకోట అజయ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వాడ్రాపల్లికి వెళ్లే మార్గంలో మధ్యాహ్నం 1.30 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ శరగడం జగన్, దాడి అప్పలనాయుడు, వేగి రామకృష్ణ, కర్రి కోటి, తదితరులు పాల్గొన్నారు.



పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాన్‌జిమ్ అధినేత అజయ్, తదితరులు

కోడి పందాల శిబిరాలపై పోలీసుల దాడులు

- 9 మంది అరెస్ట్, కోడిపుంజులు స్వాధీనం

పరవాడ: సంక్రాంతి పండగను పురస్కరించుకుని దేశపాత్రునిపాలెం, తానాం గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన కోడి పందాల శిబిరాలపై పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కోడి పందాలు ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 6 కోడి పుంజులు, రూ.5,100 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు.

మద్యం బెల్ట్ దుకాణాలపై దాడులు

- ఇద్దరి అరెస్ట్, 43 మద్యం బాటిళ్ల స్వాధీనం

పెందుర్తి: మండలంలోని గుర్రంపాలెం, ముదపాక గ్రామాల్లో మద్యం బెల్ట్ దుకాణాలపై పెందుర్తి పోలీసులు ఆదివారం దాడి చేశారు. గుర్రంపాలెంలోని ఓ ఇంట్లో మద్యం అమ్ముతున్న సమాచారం మేరకు దాడి చేసి అక్కడ నిల్వ ఉన్న 25 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ముదపాకలో ఓ ఇంటిపై దాడిలో 18 క్వార్టర్ బాటిళ్ల మద్యం దొరికింది. నిర్వాహకులపై ఏపీ ఎక్సైజ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ కె.వి.సతీష్ కుమార్ పేర్కొన్నారు.

వివేకానందునికి ఘన నివాళి



కొత్తూరులో స్వామి వివేకానంద జయంతి వేడుకలు



నెహ్రూచౌక్‌లో వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సొసైటీ సభ్యులు



వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ కాశీభట్ల వేంకట రమణమూర్తి

కశింకోట: బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద స్వామి వివేకానంద జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద విగ్రహానికి డాక్టర్ కాశీభట్ల వేంకట రమణమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. వివేకానంద గొప్పతనాన్ని వక్తలు ఈ సందర్భంగా ప్రస్తుతించారు. మాజీ ఉప సర్పంచ్ దివంగత వి. రామప్రసాద్ కుమార్తె హారిక, కుటుంబ సభ్యుల సహకారంతో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విశ్రాంత హెచ్ఎం వేదుల వేంకట శాస్త్రి, సంఘ ప్రతినిధులు కందాల పార్థసారథి, అవసరాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక స్టేట్ బ్యాంకు వద్ద స్వామి వివేకానంద జయంతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పూలమాల వేసి వివేకానంద విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. దేశ ఔన్నత్యాన్ని విదేశాల్లో వివేకానంద స్వామి చాటి చెప్పి దేశ గౌరవాన్ని ఇనుమడింపజేశారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనకాపల్లి: పట్టణ, మండలంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్థానిక నెహ్రూచౌక్ వద్ద స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ వ్యవస్థాపకుడు గోళం బుసిరాజు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానంద చేసిన సేవలు మరువలేవన్నారు. నేటి యువత స్వామి ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు కాండ్రేగుల సర్వేశ్వరరావు, దొడ్డి రమేష్, కశెట్టి సురేష్‌బాబు, బండి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. కొత్తూరు పంచాయతీ శారదానగర్‌లో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి మాజీ సైనికుడు నాగభూషణం నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ఎ.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద స్ఫూర్తి

తుమ్మపాల: స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని స్వామి వివేకానంద ఆశయకర్త వేపాడ సత్తిబాబు తెలిపారు. ఆదివారం కొత్తూరు శారదానగర్‌లో స్వామి వివేకానంద స్వామి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి పూలమాలతో శ్రద్ధాంజలి ఘటించారు. ప్రజలందరు వివేకానంద బాటలో పయనించాలని, ముఖ్యంగా యువత సన్మార్గంలో పయనించాలన్నారు. కార్యక్రమంలో పప్పల రామకృష్ణ, నేటిపల్లి రాజు, తాడి జయబాబు, బుర్ర రాజు, నడిపూరి అనిల్ కుమార్, తాడి చక్రవర్తి, పూడి సత్తిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొత్తూరులో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసిన మాజీ సైనికుడు నాగభూషణం



వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

వాకర్స్ క్లబ్ అధ్యక్షునిగా నారాయణరావు

అనకాపల్లి: అనకాపల్లి వాకర్స్ క్లబ్ అధ్యక్షునిగా రాపేటి నారాయణరావు ఎన్నికయ్యారు. స్థానిక రింగ్‌రోడ్డు ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డు ఆవరణలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో క్లబ్ కార్యదర్శిగా యల్లపు సాంబశివరావు(శివ), కోశాధికారిగా కె.వి.వి.సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నారాయణరావు మాట్లాడుతూ పై కమిటీ ఎన్నిక ఏడాది పాటు ఉంటుందన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సభ్యులు సహకారం తీసుకుంటామన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

పెందుర్తి: మానవ జీవనంలో ధ్యానం ఓ భాగం కావాలని ధ్యాన గ్రాండ్ మాస్టర్, బుద్ధ సీఈవో చంద్రశేఖర్ అన్నారు. శాకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సంతరించుకుంటుందన్నారు. పాపయ్యరాజుపాలెంలోని పిరమిడ్ ధ్యాన కేంద్రం ద్వితీయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఆరోగ్యానికి నిరంతర ధ్యాన ప్రక్రియ ఎంతగానో అవసరం అన్నారు. ధ్యానం ఒత్తిడిని జయించేలా చేస్తుందన్నారు. సామాజికంగా, ఆధ్యాత్మికంగా జీవనాన్ని ఎలా సాగించాలో కూలంకషంగా వివరించారు. మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా నిరంతర ధ్యానం అలవరచుకోవాలన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ధ్యాన మాస్టర్లు, ధ్యాన కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.



వార్షికోత్సవంలో పాల్గొన్న ధ్యాన గురువులు

వికసించిన బ్రహ్మకమలం



చినముషిడివాడలోని ఓ ఇంట్లో బ్రహ్మకమలం వికసించి, పలువురిని ఆకర్షిస్తోంది. స్థానికంగా నివాసం ఉంటున్న పురివి చెంచులక్ష్మి తన ఇంట్లోని పెరట్లో ఆరు నెలల క్రితం బ్రహ్మకమలం మొక్క నాటారు. అది ఆదివారం రాత్రి వికసించింది. పూర్తిస్థాయిలో వికసించిన బ్రహ్మకమలాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

– పెందుర్తి